సాక్షి శ్రీకాకుళం

బుధవారం ; 22 ; ఫిబ్రవరి ; 2023



బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరీక్ష కేంద్రంగా ఈ పరీక్షలు జరగుతున్నాయి.



వైభవంగా చింతామణి సంబరం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బెన్నుగానిపేట గ్రామంలో మంగళవారం చింతామణి అమ్మవారి సంబరం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు.

ఘనంగా ఇస్కాన్ సత్సంగం

కాశీబుగ్గ: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం వారు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలాస కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఇస్కాన్ సత్సంగం కార్యక్రమం చేపట్టారు. పలాస ఇస్కాన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి దక్షిణాఫ్రికా ఇస్కాన్ నుంచి త్రిదండి రామగోవింద స్వామి మహారాజ్ విచ్చేసి ప్రత్యేకంగా ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, పలాస ఇస్కాన్ సభ్యులు, శ్రీకృష్ణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రంగం ఏదైనా.. అక్రమాల వీరంగమే




ఈ బియ్యాన్ని చూడండి. పురుగులు, పట్టులు కట్టేసి ఉంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన గోడౌన్ నుంచి ఈనెల 8వ తేదీన నరసన్న పేట ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వచ్చాయి. రెండు లారీల ద్వారా వచ్చిన 40 మెట్రిక్ టన్నుల బియ్యంలో తేడా ఉండటంతో ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులు గుర్తించి వెనక్కి పంపించేశారు. ఆ బియ్యాన్నే తీసుకోవాలని నిమ్మాడ నుంచి ఒత్తిళ్లు వచ్చినా.. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్నం భోజనం పథకం కింద పిల్లలకు అందించాల్సిన బియ్యం కావడంతో తేడాలు వస్తే ప్రమాదకరమని భావించి ఏ మాత్రం రాజీపడలేదు.



ఇది టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన గోడౌన్. నిమ్మాడ సమీపంలోని పెద బమ్మిడిలో ఉన్న ఈ గోడౌన్‌ను ఆయన సోదరుడు హరిప్రసాద్ అంతా తానై నడిపిస్తున్నాడు. ఈ గోడౌన్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అద్దె కింద ఇచ్చారు. పేరుకే స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బాధ్యత. కానీ నిర్వహణ అంతా కింజరాపు హరిప్రసాద్‌దే. ఇక్కడ జరుగుతున్న అక్రమాలకు కొదవలేదు. అడిగేవారు లేక ఇష్టారాజ్యమైపోతోంది.

- కింజరాపు ఫ్యామిలీ గోడౌన్‌లో అక్రమాలు
- స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇచ్చిన గోడౌన్‌లో బియ్యానికి కొరవడిన భద్రత
- జాగ్రత్తలు తీసుకోక పురుగులు, పట్టులు కడుతున్న బియ్యం
- దీన్ని నిర్వహిస్తున్నది అచ్చెన్న సోదరుడు హరిప్రసాద్



అధికారులు రాసిన లేఖ

రెండు లారీల బియ్యం రిటర్న్ చేశాం

కోటబొమ్మాళి ఎస్‌డబ్ల్యూజీ నుంచి రెండు లారీల బియ్యం వచ్చాయి. వాటిలో పురుగులు, పట్టులు కనిపించడంతో క్వాలిటీ కంట్రోల్ ఇచ్చిన రిపోర్టు మేరకు 40మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రిటర్న్ చేశాం. రిటర్న్ చేస్తున్నట్టు లిఖిత పూర్వకంగా రాసిచ్చాం.

– బి.శైలజ, డిప్యూటీ తహసీల్దార్, నరసన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : రాజకీయాల్లోనే కాదు వ్యాపారాల్లోనూ కింజరాపు వారిది అక్రమాల బాటే. అందుకు ఆనవాలుగా ఆ కుటుంబం నిర్వహిస్తున్న బియ్యం గోడౌన్‌లో అవకతవకలు బయటపడ్డాయి. నిమ్మాడ సమీపంలో ఉన్న గోడౌన్ నుంచి పురుగులు, పట్టులు కడుతున్న బియ్యాన్ని అంగన్‌వాడీలకు, పాఠశాలలకు పంపిన అపురూప ఘనత కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాద్‌ది. ఈ గోడౌన్‌ను స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అద్దెకు తీసుకున్నప్పటికీ పర్యవేక్షణ మాత్రం ఆయనే చూస్తున్నారు. హ్యాండలింగ్, ట్రాన్స్‌పోర్ట్ తదితర కాంట్రాక్ట్ కూడా వేర్వేరు పేర్లతో ఆయన చేతిలోనే ఉంది. వాస్తవంగా మిల్లుల దగ్గరి నుంచి వచ్చిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఇక్కడ నిల్వ చేయాలి. అవి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు పంపించే వరకు భద్రంగా ఉంచాలి. నిల్వ ఉన్న బియ్యం పాడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక్కడ నుంచి వెళ్లే లోపే సక్రమంగా ఉన్నాయా? లేదా? అన్నది చూసి పంపించాలి. కానీ ఇక్కడంతా భిన్నంగా నడుస్తోంది. బియ్యం పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీంతో పురుగులు, పట్టులు కట్టేస్తున్నాయి. వాటినే రేషన్ డిపోలకు, అంగన్‌వాడీ పిల్లలకు, మధ్యాహ్నం భోజనం పథకం పిల్లలకు పంపించేస్తున్నారు.

నిమ్మాడ నుంచి వచ్చే బియ్యం అంటే సాధారణంగా తనిఖీలు చేయరనే అభిప్రా యం ఉంది. కానీ నరసన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులు సాహసం చేసి, పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పురుగులు, పట్టులు కట్టిన బియ్యాన్ని అడ్డుకున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో అన్‌లోడింగ్ చేయకుండా అభ్యంతరం తెలిపారు. లిఖిత పూర్వకంగా రాసిచ్చి వెనక్కి పంపించేశారు. జిల్లాలో ఎక్క డా ఇలాంటి పరిస్థితి లేదు. ఏ గోడౌన్‌లో ఉన్న బియ్యంలో కూడా తేడా రాలేదు. ఇక్కడొక్క దగ్గరే బియ్యంలో పురుగులు, పట్టులు కట్టాయి.

ఏదైనా జరిగితే..

ఎక్కడ ఏ చిన్న అవకాశం దొరికినా దాన్ని రాజకీయంగా పెద్దది చేసి వాడుకోవడానికి టీడీపీ చూస్తోంది. తారస్థాయిలో అవాస్తవాలను ఇప్పటికే ప్రచారం చేస్తోంది. అలాంటిది పొరపాటున ఆ పురుగుల బియ్యం బయటకు వస్తే.. ఆ నాయకులు గగ్గోలు పెట్టేసేవారు. ప్రభుత్వమే ఇలాంటి బియ్యాన్ని ఇస్తోందని బురద జల్లేవారు. నరసన్నపేట ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులు అప్రమత్తమై అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

అక్కడన్నీ అక్రమాలే..

- కింజరాపు హరిప్రసాద్, ఆయన సోదరుడు అచ్చెన్నాయుడు కనుసన్నల్లో నిమ్మాడ ఎఫ్‌సీఐ గోడౌన్‌లో దశాబ్దాలుగా అక్రమాలు జరుగుతున్నాయి.
- 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ గోడౌన్లను స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అద్దెకు ఇచ్చారు. అద్దె రూపేణా వారికి చెల్లింపులు జరుగుతున్నాయి.
- ఒక ఏసీకే అనగా (580 బియ్యం బస్తాలు) 29 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బస్తాలను మిల్లర్లు ఇక్కడ నిల్వ చేసే క్రమంలో 145 కిలోలు తగ్గించి నమోదు చేస్తారు. ఇందులో 500 కేజీల బియ్యం సొంత ఖాతాలకు వేసుకుంటున్నారు. ఇలా ఏడాదికి సుమారు 2,500 నుంచి 3000 ఏసీకేలు నిల్వ ఉంచుతారు. దీన్నిబట్టి ఎంత వెనకేసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.
- ఇది కాకుండా గోడౌన్ ఫార్మాలిటీ కింద ఒక ఏసీకేకి రూ. 2800 నుంచి రూ. 3వేలు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. ఈ ఫార్మాలిటీ ఇవ్వకపోతే తమ గోడౌన్‌కు మిల్లుల నుంచి వచ్చిన బియ్యాన్ని లారీల్లోనే రోజుల తరబడి అన్‌లోడింగ్ చేయకుండా వదిలేస్తారు. రోజుల తరబడి అన్‌లోడ్ చేయకపోతే మిల్లర్లకు మరింత నష్టం జరగనుండటంతో గోడౌన్ యజమాని హరిప్రసాద్ అడిగినంత అనధికార ఫార్మాలిటీ సొమ్మును తప్పని పరిస్థితుల్లో ఇస్తున్న పరిస్థితి నెలకొంది.
- ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లో సొంత ఖాతాకు వేసుకున్న బియ్యాన్ని తన సొంత రైస్ మిల్లుకు తరలించి, అక్కడ పాలిషింగ్ చేసుకుంటూ బయట మార్కెట్‌కు అధిక ధరలకు విక్రయిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. కానీ అధికారులు ఈ గోడౌన్ వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయడంలేదు.

భార్య చేతిలో భర్త హతం

- సోదరుడితో కలిసి భర్తను హత్యచేసిన మహిళ
- వేధింపులు తాళలేకే దాడి



మృతుడు చంద్రభూషణ్



రోదిస్తున్న చంద్రభూషణ్ బంధువులు

నరసన్నపేట: మద్యం మహమ్మారి మరో కుటుంబాన్ని నిలువునా బలి చేసింది. రోజూ తాగి వచ్చి వేధించే భర్త తీరును భరించలేక ఓ మహిళ ఏకంగా అతడిని హత్య చేసింది. అందుకు తన సోదరుడి సాయం తీసుకుంది. నరసన్నపేట మండలం పెద్దకరగాంలో మంగళవారం జరిగిన ఈ హత్య స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

పెద్దకరగాంకు చెందిన ఇర్రి చంద్రభూషణ్(37)కు పదేళ్ల కిందట తోటపాలేంకు చెందిన భాగ్యలక్ష్మితో వివాహమైంది. వీరికి మాధురి, లాస్య అనే ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చంద్రభూషణ్ తాగుడుకు బానిసైపోయాడు. ఇతర వ్యసనాలు కూడా ఉండడంతో నిత్యం భార్యను వేధించేవాడు. ఈ గొడవ గ్రామంలో పెద్ద మనుషుల వరకు కూడా వెళ్లింది. రచ్చబండలో సంప్రదింపులు జరిగాయి. అయినా చంద్రభూషణ్‌లో మార్పు రాలేదు. వారం కిందటే భార్యాభర్తలు మళ్లీ గొడవపడ్డారు. దీంతో భాగలక్ష్మి తన కన్నవారింటికి వెళ్లిపోయింది. రెండు రోజుల కిందటే భర్త వద్దకు వచ్చింది. వచ్చిన రోజు రాత్రి మళ్లీ వివాదం జరిగింది. దీంతో పోలీసులను ఆశ్రయిస్తే వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికీ చంద్రభూషణ్ మారలేదు.

సోదరుడిని పిలిచి..

మంగళవారం కూడా తాగి ఇంటికి వచ్చిన చంద్రభూషణ్ మళ్లీ భార్యతో ఘర్షణకు దిగాడు. దీంతో ఆమె తన సోదరుడు శివకు ఫోన్ చేసి ఇంటికి పిలిచారు. అతను వచ్చాక మద్యం మత్తులో ఉన్న చంద్రభూషణ్‌పై కర్రలు, మంచం కోళ్లతో దాడి చేసి విపరీతంగా కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక చంద్రభూషణ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే శివ పారిపోకుండా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన తెలుసుకున్న నరసన్నపేట సీఐ డి.రాము, ఎస్‌ఐ సింహాచలంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల కారణాలను స్థానికుల నుంచి సేకరించారు. వీఆర్వో గవరయ్య, గ్రామ పెద్దమనుషుల మధ్య శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం కేసు నమోదు చేయగా.. సీఐ రాము దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా మల్లన్న చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానాలు అనంతరం భ్రమరాంబ సమేత మల్లన్న ఉత్సవ మూర్తులు

టెక్కలి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం చక్రతీర్థ స్నానాలు నేత్ర పర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ నేతృత్వంలో ముందుగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం మల్లన్న ఆలయం ప్రాంగణంలో గల సీత కోనేరులో ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానాలు చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణ, మోహనరావు, యుగంధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

'మానవ అక్రమ రవాణాకు పాల్పడితే శిక్ష తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వాళ్లకు కఠిన శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ అనే నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌తో కలిపి మానవ అక్రమ రవాణా నిర్మూలనపై బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ లా కాలేజీ విద్యార్థులకు, శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిరోధించడంలో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగానికి సాధారణ పౌరులు కూడా సహకరించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



దాడుల్లో పట్టుబడిన బియ్యం వాహనం

సరుబుజ్జిలి: అక్రమంగా బొలేరో వాహనంలో తరలిస్తున్న 42 బస్తాల పీడీఎస్ రైస్‌ను మంగళవారం వీరభద్రాపురం గ్రామం వద్ద పట్టుకున్నట్లు సివిల్ సప్లయి డీటీ డబ్బీరు రామకృష్ణ మంగళవారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.76 వేలు ఉంటుందని తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేష్ బాబుకు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో బియ్యం రవాణా చేస్తున్న కోటబొమ్మాళి మండలానికి చెందిన బండి సతీష్‌కుమార్, సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన మోణంగి నాగభూషణరావులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అప్పగించామని వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామారావు, హెచ్‌సీ రామ్మోహన్, పీసీ ఈశ్వరరావు, వీఆర్‌ఓ ధర్మారావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సంప్రోక్షణ పూజలు



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు అనంతరం మంగళవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, అధికారులు పుణ్యతీర్థాల జలాలు, పంచగవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం ఈ సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు, అర్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు.

మాట తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్

- స్పీకర్ తమ్మినేని సీతారాం



స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

ఆమదాలవలస రూరల్: మాట తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎమ్మెల్సీ టిక్కెట్ ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థి నర్తు రామారావుతో పాటు ఇచ్ఛాపురంలోని ముఖ్యనేతలంతా కలిసి మండలంలో తొగరాం గ్రామంలో గల స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని సీతారాంను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గానికి సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. మూడు దశాబ్దాలుగా నర్తు రామారావు రాజకీయాల్లో ఉన్నారని, అలాంటి వ్యక్తికి జగన్ అవకాశం ఇచ్చారని తెలిపారు. రాజకీయ చరిత్రలో ఇదో అపూర్వ ఘట్టమని తెలిపారు. ఈ నెల 22న మధ్యాహ్నం రెండు గంటలకు నామినేషన్ వేయనున్నట్లు నర్తు రామారావు స్పీకర్‌కు తెలియజేశారు. స్పీకర్‌ను కలిసిన వారిలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బడుగు వర్గాలకు సముచిత స్థానం

శ్రీకాకుళం రూరల్: బడుగు బలహీన వర్గాల వారికి ఈ ప్రభుత్వంలోనే సముచిత స్థానం లభించిందని, సీఎం వైఎస్ జగన్ గతంలో ఇచ్చిన మాట ప్రకారమే స్థానిక సంస్థల కోటాలో నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం శుభ పరిణామమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మంగళవారం పెదపాడులోని తన క్యాంప్ కార్యాలయంలో నర్తు రామారావును ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా రామారావు ప్రజా జీవితంలో ఉన్నారని తెలిపారు. యాదవ కులానికి చెందిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారని, ఆయనకు అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు యాదవులంతా హృదయపూర్వకంగా రుణపడి ఉంటారని అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఎన్నడూ లేనట్టుగా సీఎం వైఎస్ జగన్ అన్ని సామాజిక వర్గాల వారికీ సమన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో అవమానాలకు గురైన సామాజిక వర్గాలకు ఇప్పుడు చట్ట సభల్లో మాట్లాడే అవకాశం దక్కిందన్నారు. బోయ, యాదవ, అగ్నికుల, క్షత్రియ, అలాగే వాడ బలిజ, వడ్డెర, శెట్టి బలిజ వంటి వర్గాలు ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కానీ వైఎస్ జగన్ హయాంలో వారందరికీ న్యాయం జరుగుతోందని అన్నారు. నామినేషన్‌కు పార్టీ కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు మాట్లాడుతూ తన విధేయతను, ప్రజల్లో తనకు ఉన్న నమ్మకాన్ని సీఎం వైఎస్ జగన్ గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాదవ కులాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు, వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించేందుకు తన వంతు కృషిచేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్, పార్టీ నాయకులు గురుగుబెల్లి లోకనాధం, నర్తు నరేంద్రకుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, ఎంఏ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



నర్తు రామారావును అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సిగ్గు లేని రాజకీయాలకు చంద్రబాబే కేరాఫ్

- మంత్రి సీదిరి అప్పలరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేసి సీఎం వైఎస్ జగన్ బీసీలపై తనకు ఉన్న అభిమానాన్ని మరోమారు చాటుకున్నారని పాడి, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన వెంటనే చంద్రబాబు క్రిమినల్ మైండ్‌తో పట్టాభిని పోలీసులు కిడ్నాప్ చేశారంటూ దుష్ప్రచారం చేసి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. సిగ్గు లేని రాజకీయాలకు చంద్రబాబే కేరాఫ్ అడ్రస్ అని తెలిపారు. ఆయన మంగళవారం శ్రీకాకుళంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులుగా 18 మందిని ప్రకటించగా అందులో 12 మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారేనని తెలిపారు. వడ్డెర్లను అణగదొక్కుతున్నారని లోకేష్ పాదయాత్రలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, చట్టసభల్లోకి తొలిసారి వడ్డెర్లను పంపించిన చరిత్ర జగన్‌కే దక్కిందన్నారు. బీసీల అభివృద్ధిని కోర్టులకెక్కి అడ్డుకుంటోంది టీడీపీయేనని విమర్శించారు. నాయీబ్రాహ్మణులకు తోకలు కత్తిరిస్తానని, మత్స్యకారులకు తోలు తీస్తానని, సుప్రీంకోర్టులో జడ్జిలుగా పనికిరారని చంద్రబాబు అన్నారంటే బీసీలపై ఆయనకు ఉండే కక్ష అర్థం చేసుకోవచ్చన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అంటరానివారిగా చూసే చంద్రబాబుకు ఏ శిక్ష విధించినా తప్పు లేదన్నారు. ఒకప్పుడు సూటుకేసులిస్తేనే ఎమ్మెల్సీ, రాజ్యసభ సీట్లు ఇచ్చిన చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడంపై మండిపడ్డారు. లోకేష్ పాదయాత్రను, చంద్రబాబు ప్రచారాన్ని బాగా చూపించాలనే ఏబీఎన్ రాధాకృష్ణ, ఈనాడు రామోజీరావులు నిద్రలేకుండా ఆలోచన చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పేరు కంటే వైఎస్సార్ బహుజన పార్టీ అనే పేరు పెడితే బాగుంటుందన్నారు. భవిష్యత్‌లో మంత్రి పదవి వదిలేయాలని సీఎం ఆదేశిస్తే తక్షణమే వదులుకుంటామన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ లోకేష్ పాదయాత్రలో తారకరత్న ఆరోగ్య పరిస్థితి విషయాన్ని అభిమానులకు సక్రమంగా చెప్పకపోవడం దారుణమన్నారు. విశాఖయే పరిపాలన రాజధాని అనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమని అందులో సందేహమే లేదని స్పష్టం లేదన్నారు. ఈ సమావేశంలో బల్ల గిరిబాబు, శిమ్మ రాజశేఖర్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం గ్రామ రహదారిపై ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ చేసిన ఘటన నందిగాం మండలంలో కలకలం రేపింది. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. పెద్దబాణాపురానికి చెందిన పైల ఢిల్లమ్మ ఇంటి వద్ద పనులు ముగించుకొని ఉపాధి పని కోసం మంగళవారం తన గ్రామం నుంచి జాతీయ రహదారికి వెళ్లే చెరువు గట్టు రహదారిపై నడుస్తుండగా అదే దారిలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఆమె వెనుక నుంచి వచ్చారు. బండిని కొంచెం ముందు ఆపారు. వెనుక కూర్చున్న వ్యక్తి వేగంగా బండి దిగి ఢిల్లమ్మ మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని బెండిగేటు వైపు రాంగ్‌రూట్‌లో వెళ్లిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమిర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన యాత్రకు రైతులు

పాతపట్నం: రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, నూతన పంటల పద్ధతులను అలవర్చుకోవాలని హార్టికల్చర్ అధికారి మంగమ్మ అన్నారు. స్థానిక నీలమణి దుర్గ ఆలయం వద్ద పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట మండలాలకు చెందిన రైతులు మంగళవారం విజ్ఞాన యాత్రకు బస్సులో హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. బ్రెడ్స్ సంస్థ, నాబార్డు ఆధ్వర్యంలో రైతులకు కాట్ శిక్షణ కోసం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసోర్సు సంస్థకు వెళ్లనున్నట్లు 'బ్రెడ్స్' ప్రతినిధి సాంబమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ చంద్రరావు, బి.ఆనంద్, సంతోష్ కుమార్, జనార్ధనరావు, నవీన్ పాల్గొన్నారు.

తెగులు.. దిగులు

- మొక్కజొన్నకు కాండంతొలుచు పురుగు బెడద
- వందలాది ఎకరాలపై ప్రభావం
- ఆందోళనలో రైతులు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు


మందులు పిచికారీ చేస్తున్న రైతు


సంతవురిటిలో కాండంతొలుచు పురుగు సోకిన మొక్కజొన్న పంట

జి.సిగడాం : మొక్కజొన్న రైతును కాండం తొలుచు(కత్తెర) పురుగు కలవరపెడుతోంది. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్న తరుణంలో తీరని నష్టాన్ని మిగుల్చుతోంది. పురుగు తీవ్రత ఉధ్ధృతంగా ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో గత కొద్ది సంవత్సరాలుగా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా సాగునీటి వనరులు అందుబాటులో ఉన్నవారు మొక్కజొన్న పంటపై దృష్టి సారించారు. గతంలో రబీలో ఎకరాకు సుమారు 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. క్వింటా మొక్కజొన్నకు మార్కెట్‌లో రూ.2,400 వరకు ధర ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈసారి సుమారు 70 వేల ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. అయితే ఆదిలోనే కాండం తొలుచు(కత్తెర) పురుగు ఆశించడంతో రైతులు దిగాలుపడ్డారు. జి.సిగడాం మండలంలో సీతంపేట, నక్కపేట, పెంట, నాగులవలస, సీతంపేట, బాతువ, జాడ, పాలఖండ్యాం, సంతవురిటి, టిడివలస, నడిమివలస, నిద్దాం తదితర 20 గ్రామాల్లో తెగులు తీవ్రత అధికంగా ఉంది. ఈ పురుగు వల్ల 3 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలు..

- గులాబి కాండం తొలిచే పురుగు రెండు మూడు వరుసల్లో ఆకు మొదలు, కాండం మధ్య గుడ్లు పెడుతుంది. నాలుగైదు రోజుల్లో పిల్ల పురుగులా మారుతాయి.
- మొదటి దశలో మొవ్వను రంధ్రం చేసి అంకురాన్ని చేరడం వల్ల పొడవైన రంధ్రాలు ఏర్పడతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల మొక్క చనిపోతుంది.
- కత్తెర పురుగు నివారణకు క్వినాలఫాస్ 400 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 20 -25 రోజుల తర్వాత ఏమామెడిషన్ బెనెంజేటి 80 గ్రాముల మందును పిచికారి చేయాలి.
- వరి పొలంలో భూమి దుక్కకపోవడంతో కలుపు ఎక్కువగా వస్తుంది. దీని నివారణకు కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. వరిదుబ్బు మొలకెత్తకుండా లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున పారాక్వాట్ మందును విత్తిన మరుసటి రోజు పిచికారి చేయాలి. అట్రాజిన్, పారాక్వాట్ కలిపి కూడా పిచికారి చేయవచ్చు.


జొన్నపొత్తులను నాశనం చేస్తున్న కాండం పురుగు


కాండం తొలుచు పురుగు ఇదే

అవగాహన కల్పిస్తున్నాం



మొక్కజొన్న పంటలో కాండం పురుగు నివారణపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ అధికారులు సూచించినే మందులు వాడితే ప్రయోజనం ఉంటుంది. ఏమామెక్టిన్‌బెంజోట్, స్పైనోటర్మ్ మందులను వాడితే మంచిది. ప్రస్తుతం 90 శాతం వరకు తెగులు తగ్గుముఖం పట్టింది.

– యర్రా శారద, మండల వ్యవసాయాధికారి, జి.సిగడాం

ఏఆర్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు


మోహన్‌రావు మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది

జలుమూరు: మండలంలోని నగిరికటకం పంచాయతీ దోమనాపల్లి గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మెండ మోహన్‌రావు(26) ఈ నెల 19న కర్నూలులో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మోహన్‌రావు ఎస్ఐ పరీక్ష రాసేందుకు కర్నూలు వచ్చి రైలు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామం తీసుకొచ్చారు. అధిక లాంఛనాలతో దహన సంస్కారాలు పూర్తి చేశారు. తండ్రి శోభన్‌బాబు మోహనరావు చితికి నిప్పు అంటించగా ఎస్ఐ పారినాయుడు ఆధ్వర్యంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది గౌరవ సూచికంగా గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్‌కు తీవ్ర గాయాలు

- సొంత వాహనంలో ఆస్పత్రికి పంపించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఆస్పత్రిలో ఫోన్‌లో వైద్యుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రం పాతపట్నంలోని అచ్యుతాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వలంటీర్ వట్టికుల ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం కె.మర్రిపాడుకు చెందిన వలంటీర్ ప్రకాశరావు మెళియాపుట్టి నుంచి ఆల్‌ఆంధ్ర రోడ్డు మీదుగా అచ్యుతాపురం వస్తున్నాడు. అచ్యుతాపురం వద్దకు వచ్చే సరికి ఎదురుగా పర్లాకిమిడి (ఒడిశా) నుంచి ద్విచక్ర వాహనదారుడు పరస్పరం ఢీకొనడంతో ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడ్ని పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. సూపరింటెండెంట్ వై.సురేంద్రకుమార్ ప్రథమ చికిత్స అందించారు. కాలికి తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆస్పత్రికి వెళ్లి తన సొంత కారులో వలంటీర్‌ను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, కొనసమాల పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు పల్లి యోగి ,లింగాల సంజీవరావు, అలికాన మాదవరావు, సవర సుభాష్, దువ్వాడ బాలరాజు, రవికుమార్, శామ్యూల్ పాల్గొన్నారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇఫ్టూ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



ప్రచార యాత్రలో పాల్గొన్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

పోరాట చరిత్రను సంతరించుకున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) 9వ రాష్ట్ర మహాసభలను ప్రజల సహకారంతో విజయవంతం చేద్దామని రాష్ట్ర మహాసభల కోశాధికారి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి వద్ద మహాసభల ప్రచార యాత్రను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంగా ఇఫ్టూ 45 ఏళ్లగా కార్మిక వర్గ పోరాట కర్తవ్యాలను నిర్వర్తిస్తోందన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళం కళింగభవన్‌లో ఇఫ్టూ 9వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని చెప్పారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ సోంపేట, కాకరాపల్లి పోరాటాలు ఈ నేల తెగువను మరింత చాటిచెప్పాయనీ, అరబిందో ఉద్యోగ, కార్మిక వర్గాలు సాగించిన పోరాటాలు కొత్త ఒరవడిని దిద్దాయని తెలిపారు. మహాసభలకు శ్రీకాకుళం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆహ్వాన సంఘం కార్యదర్శి దుర్గాసి గణేష్ మాట్లాడుతూ 25న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వెనుక ఉన్న కళింగభవన్ వరకూ ప్రదర్శన సాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.నిర్మల, యస్.జయలక్ష్మి, బద్దా వెంకటరావు, పిన్నింటి లక్ష్మి ఎస్.కృష్ణవేణి, చిత్తిరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు ప్రత్యేకం 'అవధానం'


అవధాని మీగడ రామలింగస్వామిని సన్మానిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అవధాన ప్రక్రియ తెలుగు భాషకు ప్రత్యేకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా సంగీత సవావధానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ అవధాని మీగడ రామలింగస్వామి పాల్గొని అవధానం నిర్వహించారు. పలువురు ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిచ్చారు. గయోపాఖ్యానం, పాండవ ఉద్యోగ విజయాలు, సత్య హరిశ్చంద్ర పద్యాలను వినిపించారు. 2006 నుంచి తాను సంగీత అవధాన ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థుల్లో వక్తృత్వ వికాసం అవసరమని తెలిపారు. క్రమశిక్షణతో లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అద్దయ్య, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ చౌదరి తేజేశ్వరరావు, తెలుగు విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఉమ్మడి శాంతి, విభాగ సమన్వయకర్త డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం


రోహిణీరావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన రోహిణీరావును జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈమె కొన్నేళ్లు శ్రీకాకుళం కోర్టులో న్యాయవాదిగా సేవలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, మొదటి అదనపు న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, బార్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫల్గుణరావు, న్యాయవాదులు సుభాష్, అన్నెపు సత్యనారాయణ, ఎన్ని సూర్యారావు, శిష్టు రమేష్,, రమణదయాల్, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కూన అన్నంనాయుడు, మామిడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

సత్తాచాటిన సిక్కోలు క్రీడాకారులు


నందిని, గాయిత్రిలను అభినందిస్తున్న ఏఆర్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. రజత పతకాలు సాధించి శభాష్ అనిపించారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల వేదికగా ఈ నెల 16 నుంచి 20 వరకు 41వ ఆలిండియా సబ్‌-జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-23 పోటీలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు అత్యద్భుతంగా రాణించింది. తమిళనాడుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెస్ట్ ఆఫ్ త్రీలో స్వల్పతేడాతో తమిళనాడు విజేతగా నిలవగా, ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్‌తో సరిపెట్టుకుంది. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు సిక్కోలు క్రీడాకారులు సింగూరు నందిని(లింగాలపేట), ముంత గాయిత్రి(ఎచ్చెర్ల) కీలకపాత్ర పోషించి రజత పతకాలు సాధించారు. నందిని ఏపీ ఆర్ఎస్ గురుకుల పాఠశాల ఎచ్చెర్లలో 10వ తరగతి చదువుతుండగా, గాయిత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్లలో 10వ తరగతి చదువుతోంది. వీరిని మంగళవారం ఏఆర్ డీఎస్పీ ప్రసాదరావు అభినందించారు. జిల్లాకు, రాష్ట్రాన్ని గౌరవాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. నగదు బహుమతిని అందజేసి సంఘ ప్రతినిధులను, కోచ్ మధుసూదన్‌ను అభినందించారు.

13న పోలీస్ వాహనాలు వేలం

ఎచ్చెర్ల క్యాంపస్:

మార్చి 13న పోలీస్ వాహనాలు వేలం వేయనున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్సులు-2, టాటా సుమోలు-3, కమాండర్ జీపులు -5, మహింద్రా జైలో-1, టయోటా ఇన్నోవా-1, టాటా స్పేసియస్-4, ఆల్టో కారు-1, మోటార్ సైకిల్స్-9 వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మార్చి 13న ఉదయం 11 నుంచి 5 గంటల వరకు వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. మార్చి 10న వాహనాల పరిశీలనకు ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం మోటార్ వెహికల్ విభాగంలో అనుమతిస్తామని తెలిపారు. పోర్టల్ ఆఫ్ ఏపీ గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో ఈ -ఆక్షన్‌లోనూ పాల్గొవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు యూనిట్ మెకానిక్ (9989074783), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (6309990841), డీఎస్పీ (6309990813)లను సంప్రదించవచ్చని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయసు 50 ఏళ్ల ఉంటుంది. మృతుని జేబులో లభించిన ఫోన్ నంబర్‌కు పోలీసులు సంప్రదించగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా తేలినట్లు సమాచారం. తల నుజ్జు కావడంతో కుటుంబ సభ్యులు వచ్చి గుర్తిస్తేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశముంటుంది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.